క్లుప్తంగా

ఎంజేఎస్ జిల్లా అధ్యక్షుడిగా సాగర్

ములుగు : జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో మాదిగ జాగృతి సంఘం (ఎంజేఎస్) జిల్లా కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పసుల సాగర్, ప్రధాన కార్యదర్శిగా వాసంపల్లి సాంబశివన్, ఉపాధ్యక్షుడిగా కరుణాకర్, కార్యదర్శిగా కోకిల అజయ్‌కుమార్, కోశాధికారిగా కాకి సతీష్‌లు ఎన్నికైనట్లు రాష్ట్ర కార్యదర్శి సాంబయ్య తెలిపారు.

కళా ఉత్సవ్ పోటీలు

మంగపేట : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో కళా ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్, పాటలు, నృత్య ప్రదర్శన పోటీలను ఎంఈఓ మేనక పర్యవేక్షణలో సోమవారం నిర్వహించారు. పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలల్లో 9 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలను జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు పంపించనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

వ్యాధుల బారిన పడుతున్న గిరిజనులు


బురద నీటితో ఉన్న బావి

వెంకటాపురం(కె): బురద నీరు తాగి వ్యాధుల బారిన గిరిజనులు పడుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు అన్నారు. సోమవారం మండలంలోని సీతారాంపురం గ్రామాన్ని సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న బావుల్లో నీరు బురదమయంగా ఉన్నాయని తెలిపింది. అధికారులు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించకపోతే గ్రామస్తులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు కుమ్మరి శ్రీను, కృష్ణ, రంగయ్య, మల్లయ్య, నాగేష్, శంకర్, శ్రీను తదితరులు ఉన్నారు.

రోడ్డు పనులు చేపట్టాలి


పీఓకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

ఏటూరునాగారం: వెంకటాపురం(కె) మండలం సీతాపురం గ్రామంలోని రోడ్డు, కల్వర్టుల నిర్మాణానికి రూ. 3.59 లక్షలు మంజూరు కాగా పనులు చేయడం లేదని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఇరుప శ్రీను అన్నారు. సోమవారం ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాల గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణీలు సైతం వాగు దాటే పరిస్థితి లేదన్నారు. జ్వరాలు వస్తే గ్రామానికే పరిమితం కావాల్సి ఉందన్నారు. వెంటనే రోడ్డు పనులు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని పీఓను కోరినట్లు శ్రీను తెలిపారు. కార్యక్రమంలో శంకర్, మల్లయ్య, నగేష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

ఏటూరునాగారం: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని మహిళా సాధికారత కేంద్ర జిల్లా మిషన్ కోఆర్డినేటర్ రమాదేవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత కేంద్రం పది రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి హాజరై మాట్లాడుతూ గృహ హింస చట్టం-2005, పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేదింపుల నిషేధ చట్టం-2013, వరకట్న నిషేధ చట్టం -1961, అనైతిక రవాణా నివారణ చట్టం-1956 చట్టాలను తెలుసుకుంటే ధైర్యంగా పోరాటే సత్తా ఉంటుందన్నారు. చదువుతోపాటు సమాజంలోని మంచి చెడులను గ్ర హించాలన్నారు. జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చీఫ్ లీగల్ మేకల మహేందర్, స్పెషలిస్టు ఇన్‌ఫైనాన్సియల్ లిటరసీ శిరీష, తాత్కాలిక ఇన్‌చార్జ్ లెక్చరర్ శ్రావణి, పాల్గొన్నారు.

గ్రామ కమిటీల ఎన్నిక

ములుగు రూరల్: మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మహిళా కమిటీలను ఎన్నుకున్నట్లు పార్టీ మహిళా కమిటీ మండల అధ్యక్షురాలు గుంటోజు పావని తెలిపారు. సోమవారం రాయినిగూడెం, సర్వాపూర్, అంకన్నగూడెం గ్రామాల్లో మహిళా కమిటీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. రాయినిగూడెం అధ్యక్షురాలిగా వజ్జ పద్మ, సర్వాపూర్ అధ్యక్షురాలిగా ఎర్రోజు నిర్మల, అంకన్నగూడెం అధ్యక్షురాలిగా మేకల యశోదలను ఎన్నుకున్నారు.

అందని పారితోషికం

- పట్టించుకోని అధికారులు
- 10 నెలలుగా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న డాటాఎంట్రీ ఆపరేటర్లు


ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు (ఫైల్)

వెంకటాపురం(కె): సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వే ఫామ్‌లను డాటా ఎంట్రీ చేసిన ఆపరేటర్లకు నేటి వరకు పారితోషికం అందలేదు. మండలంలో ఇప్పటి వరకు డబ్బులు అందకపోవటంతో విధులు నిర్వహించిన ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వే ముగిసి 10 నెలలు గడిచినా డబ్బులు ఇవ్వకపోవటం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

నవంబర్‌లోనే సర్వే పూర్తి

రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నవంబర్‌లో స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ చేసేందుకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ కులగణన చేపట్టింది. మండలంలోని 18 పంచాయతీల్లో సర్వే నిర్వహించగా కేజీబీవీ టీచర్లు, అధ్యాపకులు, జీపీ కార్యదర్శులు ఎంఆర్‌సీ సిబ్బంది, ఇతర విభాగాలకు చెందిన ఉద్యోగులు విధులు నిర్వహించారు. సర్వే పర్యవేక్షణ కోసం మండ స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సూపర్‌వైజర్‌గా నోడల్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులను నియమించి సర్వే పూర్తి చేయించారు. గత ఏడాది నవంబర్ 9 నుంచి 22 వరకు ఎన్యుమనేటర్లు ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. ఒక్కో ఎన్యుమనేటర్ 150 ఇళ్లను సర్వే చేసి వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు. వారి నేతృత్వంలో ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశారు. కాగా డాటా ఎంట్రీ ప్రైవేట్ ఆపరేటర్లకు ఒక్కో షిఫ్ట్‌కు రూ.750, ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే కాంట్రాక్టు ఆపరేటర్లకు రూ.350 చొప్పున వేతనం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాగా వారికి నేటి వరకు పారితోషికం అందకపోవటంతో డాటా ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే విడుదల చేయాలి



కులగణన సర్వే ఫామ్‌లను డాటా ఎంట్రీ చేసిన ఆపరేటర్లకు, ప్రభుత్వం ప్రకటించిన పారితోషికం వెంటనే విడుదల చేయాలి. సర్వే పూర్తయి 10 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు డబ్బులు చెల్లించలేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. – కె.స్వామి, డాటాఎంట్రీ ప్రైవేట్ ఆపరేటర్

ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా



కుల గణన సర్వే ఫామ్‌లు డాటా ఎంట్రీ చేసిన డబ్బుల కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టు తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. డాటా ఎంట్రీ చేసి పది నెలలు గడుస్తున్నా డబ్బులు రాలేదు.

– గడ్డం శ్రీలత, ఆపరేటర్

రోడ్డు మరమ్మతు చేపట్టాలి


మంగపేట : ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న సీపీఎం, గిరిజన సంఘం నాయకులు



ములుగు రూరల్ : జిల్లా కేంద్రంలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

మంగపేట : మండలంలోని జిల్లా సరిహద్దు బ్రాహ్మణపల్లి నుంచి ఏటూరునాగారం వరకు గల ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో కోమటిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం రాస్తారోకో చేపట్టారు. సీపీఎం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సుమారు అరగంట పాటు నిర్వహించిన కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ.దావూద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాన రోడ్డుపై గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం, అధికారులు విచ్చలవిడిగా ఇసుక లారీలకు అనుమతులు ఇచ్చి రహదారులు పాడవడానికి కారణమయ్యారని ఆయన ఆరోపించారు. ఇసుక దోపిడీ ద్వారా ప్రభుత్వానికి కోట్ల కొద్ది ఆదాయం వస్తుందని దీనిపై ఉన్న చిత్తశుద్ధి పాడైన రోడ్లను బాగు చేయడంలో లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్ఎస్ ప్రసాద్, ఎల్‌పీ ముత్యాలు, సీఐటీయూ మండల నాయకులు రవి, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు నాగేష్, చిరంజీవి, కృష్ణ, మంగయ్య, రామారావు, దేవయ్య, శేఖర్ పాల్గొన్నారు.

నూతన రోడ్లను నిర్మించాలి

ములుగు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో నూతన రోడ్లను నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండీ అమ్జద్‌పాషా డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాకేంద్రంలో ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కొత్తూరు నుంచి యాపలగడ్డకు, పొట్లాపూర్ నుంచి పంచోత్కులపల్లికి , జగ్గన్నగూడెం నుంచి కొత్తగూడెం మండలం ఓటాయి గ్రామాలకు రోడ్లు నిర్మించడంతో ఏజెన్సీ గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం ఉంటుందని అన్నారు. కన్నాయిగూడెం నుంచి లక్నవరం కట్టపైకి రోడ్డు నిర్మించడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు లక్నవరం చేరుకోవడం సులువుగా ఉంటుందని అన్నారు. అనుసంధాన రోడ్లు లేక దూరప్రాంతాల నుంచి ప్రయాణించాల్సి వస్తుందని అన్నారు. రాజు, కృష్ణయ్య, కొమురయ్య, మహేందర్, నారాయణసింగ్, నర్సయ్య, సాంబయ్య, సంపత్ పాల్గొన్నారు.

కార్మికుడి మృతిపై రాజకీయమా

- కార్మికుడి వేతనానికి ప్రభుత్వానికి సంబంధం లేదు
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్


మాట్లాడుతున్న బానోతు రవిచందర్

ములుగు: స్థానిక మున్సిపాలిటీలో మల్టిపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న మైదం మహేశ్ మరణాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం కేటీఆర్ వాడుకోవడం సిగ్గుచేటని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ విమర్శించారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాంద్ పాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఒక అబద్ధాన్ని నూరుసార్లు చెప్పి నిజమని నమ్మించడమే గోబెల్స్ పాఠమని కేటీఆర్ దానిని మించి పోయాడన్నారు. కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు తన సొంత నియోజకవర్గంలో సర్పంచ్‌లు, కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. అధికారం పోగానే కేటీఆర్ ప్రజల మీద కపట ప్రేమ ప్రదర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మహేశ్ వేతనం ఆలస్యం కావడంలో ప్రభుత్వ తప్పిదం లేదని, జీతం ప్రాసెస్ చేసే సమయంలో స్థానిక పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంతో వేతనం ఆలస్యమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మందికి, ములుగులో వందలాది మందికి జీతాలు సమయానికి అందగా, మహేశ్ విషయంలో స్థానిక సిబ్బంది చేసిన నిర్లక్ష్యానికి బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకొని పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసి, బిల్ కలెక్టర్‌ను విధులనుంచి తొలగించడం జరిగిందన్నారు. మైదం మహేష్ కుటుంబానికి పరిహారం కూడా అందించడం జరిగిందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, జిల్లా నాయకులు వంగ రవి యాదవ్, నల్లెల్ల భరత్ కుమార్, యాసం రవీందర్, బోడ రఘు, అనిల్ కుమార్, నాయకులు శంకర్ చారి, నేపాల్ రావు, తిరుపతి, నాగరాజు, సయ్యద్ షకీల్ అహ్మ ద్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలి


మాట్లాడుతున్న పూనెం సాయి

వాజేడు : ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి డిమాండ్ చేశారు. మండలంలోని పెనుగోలు కాలనీలో సోమవారం ఆదివాసీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన లంబాడాలు ఎస్టీలుగా చలామణి అవుతున్నారని, నిజమైన ఎస్టీలు ఆదివాసీలే నన్నారు. ఆదివాసీలకు అందాల్సిన రిజర్వేషన్ ఫలాలు లంబాడీలు పొందుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలపై సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నాయని ఆరోపించారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

ములుగు రూరల్ : ప్రతిపక్ష బంజారా నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలని బంజారా నాయకులు హట్కార్ స్వామి, బానోత్ బాలాజీ అన్నారు. సోమవారం మల్లంపల్లిలో బంజారా నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు ప్రతిపక్ష బంజారా నాయకులు ప్రభుత్వం, మంత్రి సీతక్కపై తప్పుడు ప్రచారం చేస్తూ జిల్లాలోని బంజారాలను అయోమయానికి గురి చేస్తు నీచ రాజకీయం చేస్తున్నారని అన్నారు. ఆదివాసీ ఎమ్మెల్యేలు సీఎంను కలిసి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు కావాలని వినతిపత్రం అందజేస్తే దాన్ని తప్పుగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. నాయకులు మాలోత్ రవి, సురేష్, మైలుసింగ్, బీమా, వెంకన్న ఉన్నారు.

ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు


జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం : విద్యకు తగ్గట్టు అవకాశాలు రాకున్నప్పటికీ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందుకు వెళ్లాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. సోమవారం స్థానిక బీఆర్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాకు లక్ష్మీనర్సింహరావు ప్రారంభించి మాట్లాడుతూ నిరుద్యోగుల కష్టాలను తెలుసుకొని జంపయ్య జాబ్‌మేళాను నిర్వహించడం అభినందనీయమన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు సుమారు 200 హాజరు కాగా 80 మంది ఎంపిక కావడంతో వారికి నియామకపత్రాలను లక్ష్మీనర్సింహారావు అందజేశారు. 120 మందికి సంబంధించిన నిరుద్యోగ యువతీ యువకులను వివిధ కంపెనీలకు రెఫర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రదీప్‌రావు, భూక్య జంపయ్య, సునీల్, ఖాజాపాషా, రమణయ్య, కుర్బాన్ అలీ, సమ్మయ్య, రఘు, చంద్రబాబు, మోహన్‌రావు, చిన్ని, కృష్ణ, రాంనర్సయ్య, మల్లయ్య, పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం


ఏటూరునాగారం: ఓటరు జాబితాలను చూపిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్, నాయకులు

ఏటూరునాగారం/వాజేడు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీల ముసాయిదా ఓటరు జాబితాలను సోమవారం ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రదర్శించి ఆయా పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓలు శ్రీనివాస్, శ్రీకాంత్‌నాయుడు తెలిపారు. మండల స్థాయి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అభ్యంతరాలను స్వీకరించామన్నారు. వార్డుల్లో తప్పిపోయిన ఓటర్లు, డెత్ కేసుల వివరాలను సేకరించినట్లు పేర్కొన్నారు. ఓటరు లిస్ట్ బూత్ వెరిఫికేషన్ చేశామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కుమార్, రఘు, ఆయూబ్, ఖలీల్, లాలయ్య, ఎల్లయ్య, ప్రసాద్, గౌస్, రాములు, జయ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల కోసం జాయింట్ సర్వే


సర్వే కోసం పడవలో వెళ్తున్న అధికారులు

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని మూడు గ్రామాల్లో కొత్త ఇసుక రీచ్‌లు ఏర్పాటు కోసం సోమవారం అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, గ్రౌండ్ వాటర్, మైనింగ్, ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వేను సుబ్రమణ్యపురం, పాత్రాపురం, చొక్కాల గ్రామాల్లో నిర్వహించారు. ఈ గ్రామాల పరిధిలోని గోదావరి నదిలో ఇసుక రీచ్ పాయింట్‌లను ఏర్పాటు కోసం సర్వే చేశారు. కాగా ఈ గ్రామాల వద్ద గోదావరిలో వరద నీరు ఉండటంతో సర్వే చేయటం వీలు కాకపోవటంతో విషయాన్ని ఫోన్‌లో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం సర్వేను నిలుపుదల చేసి వెనక్కి రావాలని చెప్పటంతో అధికారులు వెనక్కి తిరిగి వచ్చారు. ఏడీఏ రామ్మూర్తి, ఇరిగేషన్ ఈఈ రవితేజా, గ్రౌడ్ వాటర్ అధికారి కృష్ణ,తహసీల్దార్ వేణుగోపాల్, అధికారులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలి


వాజేడు : మేళాను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీకాంత్‌నాయుడు


మంగపేట : ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన ఉపాధ్యాయులు

వాజేడు : ఉపాధ్యాయుల సేవలను విద్యార్థులు వినియోగించు కోవాలని వాజేడు ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు, ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం టీఎల్‌ఎం కృత్యమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 38 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు తెలుగు, ఆంగ్లం, గణితం, సైన్స్‌కు సంబంధించిన అంశాలపై విద్యార్థులకు సులభంగా అర్థం చేసుకునే రీతిలో బోధనోప కరణాలను తయారు చేసి ప్రదర్శించారు. వీటిని ఎంపీడీఓ, ఎంఈఓ పరిశీలించి తరగతిలో వీటిని ఏ విధంగా ఉపయోగిస్తారో అడిగి తెలుసుకున్నారు. ముందుగా మండలంలో పని చేస్తున్న 20 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి వారిని సన్మానించడంతో పాటు మొమెంటోను వాజేడు, ధర్మవరం హెచ్‌ఎం ఆనందరావు, వేణుగోపాల్‌లతో కలిసి అందజేశారు.

శిక్షకులకు అవార్డులు

స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలోని శిక్షకులు (లెక్చరర్లు) సోమవారం హైదరాబాద్‌లో మంత్రి గడ్డం వివేక్, ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిషోర్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు.

ఉపాధ్యాయులు భావితరాల నిర్మాతలు

మంగపేట: ఉపాధ్యాయులు భావితరాల నిర్మాతలు అని ఎంఈఓ మేనక అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి మెమొంటోను అందచేసి ఘనంగా సన్మానించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం భిక్షం, శ్రీనివాస్, అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో టీచర్స్ డే సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఐటీఐలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వావిలాల మువీస్ కుమార్‌ను కార్మికశాఖ మంత్రి వివేక్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఐటీఐలో మువీస్ కుమార్ అందించిన సేవలకు ఈ అవార్డు అందుకోవడంతో ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు.

యూరియా కోసం బారులు


యూరియా కోసం బారులుదీరిన రైతులు

ఏటూరునాగారం : మండలంలోని రైతులకు యూరియా బస్తాల కోసం సోమవారం మండలంలోని చిన్నబోయినపల్లి పీఏసీఎస్ గోదాం వద్ద బారులుదీరారు. ఆధార్ కార్డు ఉన్న రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అగ్రికల్చర్, పీఏసీఎస్ అధికారులు రైతులకు అందించారు. ఈ వారం రోజుల్లో రైతులకు 888 బస్తాలను పంపిణీ చేసినట్లు ఏఓ వేణుగోపాల్ తెలిపారు. మరో 2400ల బస్తాలు వస్తే రైతులకు సరిపోతాయని, ఎవరుకూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఓ తెలిపారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్ బందోబస్తు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అయితే కొంత మంది రైతులు తీసుకున్నవారే తీసుకుంటున్నారని, అలా చేయడంతో అసలు దొరకని రైతులకు అన్యాయం జరుగుతుందని స్థానిక రైతులు ఆరోపించారు.

సంక్షిప్త సమాచారం

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

గోవిందరావుపేట : బీఆర్‌ఎస్ నాయకులు చేసే అసత్య ప్రచారాలను బంజారా సోదరులు నమ్మొద్దని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాంనాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్య రాజు ఆధ్వర్యంలో బంజారా సోదరుల ముఖ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా సీతారాం నాయక్ హాజరై మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవలేమనే అపోహతో అన్నదమ్ములా కలిసి ఉన్న కులాల మధ్య చిచ్చును రగిలించి ప్రయోజనం పొందాలని చూస్తున్నారు అని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వాజేడు: ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన నరేశ్ వాజేడు నుంచి ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నరేశ్‌కు తీవ్ర గాయాలు అలాగే మండలంలోని పావిరాల వాగు బ్రిడ్జి సమీపంలో కంటైనర్, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీ కొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్ తెలిపారు. చంద్రుపట్లకు చెందిన పాయల రాంబాబు ద్విచక్ర వాహనంపై చత్తీస్‌గఢ్ వైపు వెళ్తుండగా చత్తీస్‌గఢ్ వైపు నుంచి కంటైనర్ వస్తుంది. పావిరాల వాగు బ్రిడ్జి సమీపంలో రెండు ఢీకొనడంతో రాంబాబుకు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన 108 వాహనంలో ఏటూరునాగారం సామాజిక వైద్య శాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు. రాంబాబు తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(కె): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి భాస్కర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని శాంతినగర్, ఎస్సీ మర్రిగూడెం గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి వైద్య సిబ్బంది ఇంట్లో ఎంత మంది కుటుంబ సభ్యులు ఉంటున్నారు. వారిలో ఎవరైనా జ్వరంతో బాధ పడుతున్నారా అనే విషయాలను సర్వే చేశారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు.

ముందస్తు అరెస్టులు దుర్మార్గం


పోలీస్‌స్టేషన్‌లో మాల మహానాడు నాయకులు

మంగపేట : హక్కుల కోసం పోరాడుతున్న వారిని ముందస్తుగా అక్రమంగా అరెస్టులు చేసి అడ్డుకోడం దుర్మార్గమైన చర్య అని జాతీయ మాల మహానాడు పొలిట్‌బ్యూరో సభ్యుడు చిట్టిమళ్ల సమ్మయ్య అన్నారు. మాలమహానాడు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జీఓ నంబర్ 99 సవరణ, రోస్టర్ పాయింట్లు 22 నుంచి 16కు తగ్గించాలనే డిమాండ్లతో జిల్లా, నియోజకవర్గ ఎమ్మెల్యేల క్యాంపుల ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్తున్న సమ్మయ్యతో పాటు మరి కొందరిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ ఇళ్లలోకి వచ్చి ముందస్తు పేరుతో అక్రమంగా అరెస్టుచేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే జాతీయస్థాయి మాలమహా నా డు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టి ప్ర భుత్వానికి తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు.

వెంకటాపురం(ఎం) : ములుగు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడికి వెళ్లకుండా నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లో తరలించడం విడ్డూరంగా ఉందని, అక్రమ అరెస్టులతో మాలల ఉద్యమాన్ని ఆపలేరని జాతీ య మాల మహానాడు ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ జనగాం రవీందర్ పేర్కొన్నారు.

గురుకుల విద్యతో విద్యార్థులకు భవిష్యత్


దేహదారుఢ్య పరీక్షలను పరిశీలిస్తున్న ఆర్‌సీఓ హరిసింగ్

ఏటూరునాగారం: గురుకుల విద్యతో విద్యార్థుల భవిష్యత్ మరింత మెరుగు పడుతుందని గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ హరిసింగ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్పోర్ట్స్ స్కూల్ బాలుర 5వ తరగతిలో ప్రవేశం కోసం దేహదారుఢ్య పరీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించడమే గురుకులం లక్ష్యం అన్నారు. గిరిజన విద్యార్థులను 5వ తరగతిలో ప్రవేశం కోసం 8, 9 తేదీల్లో బ్యాటరీ టెస్టులు(దేహదారుఢ్య)పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 49 మందికి పరీక్షలు చేపట్టామని, అందులో కొంత మంది ఎంపికై నట్లు ఆర్‌సీఓ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజునాయక్ పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్‌ఎంలు

ములుగు రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందిస్తున్న రెండో ఏఎన్ఎంలకు పని భారం తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. సోమవారం రెండో ఏఎన్‌ఎంలతో కలిసి కలెక్టర్ కార్యాయలం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికి ఆరోగ్య సేవలు అందిస్తున్న ఏఎన్‌ఎంలు వివరాలు మొబైల్ ఆన్‌లైన్ చేయడం భారమని అన్నారు. 18 ఏళ్లుగా ఉద్యోగ భద్రత లేకుండా విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలను పర్మనెంట్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్య, ముత్యాల రాజు పాల్గొన్నారు.

దోమలమందు పిచికారీ

కన్నాయిగూడెం : మండలంలోని లక్ష్మీపురంలో స్థానిక వైద్య సిబ్బంది దోమలమందు పిచికారీ చేశారు. స్థానిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అభినవ్ ఆధ్వర్యంలో రెండో దఫా దోమల నివారణ చర్యగా మందును పిచికారీ ఇంటింట తిరుగుతూ చేపడుతున్నారు. హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్ పిచికారీ చేయిస్తున్నాడు. అనంతరం డ్రైడే కార్యక్రమం చేపట్టారు.